క్లుప్తంగా

ఎరువుల దుకాణాల తనిఖీ

రాపూరు: ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన దుకాణాల నుంచి రైతులు వరి విత్తనాలు కొనుగోలు చేయాలని ఇందుకూరుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం మద్దెలమడుగులోని వినాయక సీడ్ షాపును తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వరి విత్తనాలు తీసుకున్న ప్రతి రైతూ తప్పనిసరిగా బిల్లు తీసుకుని పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. రైతులకు అవసరమైన వివిధ రకాల వరి విత్తనాలు 300 బస్తాల వరకు ఉన్నాయని తెలిపారు. నారు పోసేముందు మొలకల శాతాన్ని పరిశీలించాలని సూచించారు. ఏవో సోమసుందరం,సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా సామాజిక తనిఖీ

రాపూరు : మండలంలో 2023–24 సంత్సరాలకు సంబంధించి ఉపాధిహామీ పథకం కింద చేసిన పనులను సామాజిక తనిఖీలను పక్కాగా చేయాలని ఎస్‌టీఎం పొన్నయ్య తెలిపారు. ఆయన సోమవారం రాపూరు ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ, ఉపాధి హామీ పథకం సిబ్బందితో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పనులపై తనిఖీలు చేసి గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ నాగార్జున, ఏపీఎంలు చంద్రయ్య, సుబ్బరాయులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

నాయుడుపేట టౌన్ : దివ్యాంగురాలైన కృష్ణవేణి అమ్మ ఫౌండేషన్‌ను నిర్వహిస్తూ దాతల సహకారంతో చేస్తున్న సేవలు అభినందనీయమని రోటరీ క్లబ్ నిర్వాహకులు తెలిపారు. నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాల వద్దకు వచ్చే రోగులు, గర్భిణులు, బాలింతలు, పేదలకు సోమవారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ప్రతి రోజూ నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం 100 రోజులు పూర్తి చేసుకుంది. ఈ క్రమంలో బాష క్యాటరింగ్ నిర్వాహకులు అన్నదానం చేశారు. వైద్యశాల సూపరింటెండెంట్ మీజూరు చంద్రకళ, కృష్ణవేణి, హాజీ నిజాం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మెట్టు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయుడు

చిట్టమూరు(చిల్లకూరు) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు చిట్టమూరు మండలం మెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పవిత్ర, పద్మప్రియ, హరిణి ఎంపికై నట్టు హెచ్‌ఎం పార్థసారధి సోమవారం తెలిపారు. నెల్లూరులో జరిగిన జిల్లా స్థాయి అండర్–14 విభాగంలో హ్యాండ్‌బాల్ పోటీల్లో వీరు ప్రతిభ చూపినట్టు పేర్కొన్నారు. త్వరలో తెనాలిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. వారితోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు ధనుంజయను ఆమె అభినందించారు.

చెకుముకి పోటీలకు గూడూరు విద్యార్థులు

గూడూరు రూరల్ : రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు గూడూరులోని జీవీఎస్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్టు కరస్పాండెంట్ పవన్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ జేవీవీ ఆధ్వర్యంలో తిరుపతిలో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో తమ విద్యార్థులు భవన్య, వెంకటేష్, ఉదయ్‌కుమార్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. హెచ్‌ఎం రాము. ఉపాధ్యాయులు మల్లికార్జున్, జేవీవీ ప్రతినిధులు చెంచు నారాయణ, ప్రభాకర్, సుమన్‌రెడ్డి, రజనీకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో వరిలో అధిక దిగుబడి

బాలాయపల్లి(సైదాపురం) : యాజమాన్య పద్ధతులు పాటిస్తే వరిలో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ భాస్కరయ్య తెలిపారు. ఆయన సోమవారం బాలాయపల్లి మండలం పిగిలాంలో రైతులకు వరిసాగుపై అవగాహన కల్పించారు. మోతాదుకు మించి ఎరువుల వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో ఏవో శిరీష, వేణుగోపాల్, వీఏవోలు గోపాల్, వినోద్‌కుమార్, పెంచలయ్య, సలీం పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

వెంకటగిరి రూరల్ : పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ విస్తరణ అధికారి గోవిందరాజులు తెలిపారు. వెంకటగిరిలోని కేవీకేలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషకాహార తోటలపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆకు కూరలు, కూరగాయల తోటలు పెంచుకోవడం ద్వారా కుటుంబాలకు ఆసరాగా ఉంటుందని తెలిపారు. ఏడీఏ నాగార్జునసాగర్, సీడీపీవో శంషాద్‌బేగం, కేవీకే శాస్త్రవేత్తలు విజయశ్రీ, డి.తిరుపాల్, నాగార్జునరెడ్డి, రాజీవన పాల్గొన్నారు.

కండలేరులో 42.379 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరులో సోమవారం నాటికి 42.379 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల నుంచి కండలేరుకు 9,400 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 1,460, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 10, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

శిథిలావస్థలో సంపద కేంద్రాలు

చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీలను అభివృద్ధి బాటలో నడిపిస్తామని గొప్పలు చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. సంపద తయారీ కేంద్రాలు షెడ్లకే పరిమితమయ్యాయి. గ్రామాల నుంచి చెత్తను సేకరించి వానపాముల ద్వారా ఎరువులు తయారీ పడకేసింది. దీంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సంపద తయారీ కేంద్రాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నా పట్టించుకునే నాథుడు లేడు.

- షెడ్లకే పరిమితమైన సంపద తయారీ కేంద్రాలు
- మందు బాబులకు అడ్డగా మారుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



తల్లంపాడులో శిథిలావస్థలో ఉన్న సంపద తయారీ కేంద్రం

దొరవారిసత్రం : మండలంలో 22 పంచాయతీలు ఉండగా 16 పంచాయతీల్లో 2016–17 అప్పటి టీడీపీ ప్రభుత్వం సంపద తయారీ కేంద్రాలను నిర్మించింది. ఒక్కో కేంద్రానికి రూ.3.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేసింది. ఈ కేంద్రాలకు గ్రీన్ అంబాసిడర్లు గ్రామాల నుంచి సేకరించే తడి, పొడి చెత్తను తరలిస్తారు. అక్కడ నిర్మించిన తొట్లలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేస్తారు. 45 రోజుల పాటు డ్రై అయిన తరువాత వానపాములను వదిలి నిత్యం నీటితో తడుపుతూ వర్మీకంపోస్ట్ ఎరువులు తయారు చేస్తారు. అనంతరం దాన్ని జల్లెడ పట్టి కవర్లలో ప్యాక్ చేసి రైతులకు విక్రయిస్తారు. కేజీ వర్మీకంపోస్ట్ ఎరువు రూ.8ల నుంచి రూ.10లకు విక్రయించాలి. తొగరాముడి, శ్రీధనమల్లి, తల్లంపాడు గ్రామాల్లోని తయారీ కేంద్రాల షెడ్లకు వేసిన రేకులు దెబ్బతిన్నాయి. పూలతోటలో నిర్మించిన తయారీ కేంద్రం నేలమట్టమైంది. తనియాలి, వెదురుపట్టు, నేలపట్టు, మీజూరు, తల్లంపాడు, ఏకొల్లు తదితర



తనియాలిలో నిరుపయోగంగా తయారీ కేంద్రం

ప్రాంతాల్లో సంపద తయారీ కేంద్రాలు బాగున్నప్పటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. బూదూరు, వేణుంబాకం గ్రామాల్లో కేంద్రాలు పిల్లర్లకే పరిమితమై దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. పంచాయతీ కేంద్రమైన ఏకొల్లులో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో వర్మీకంపోస్టు ఎరువు తయారు చేసి విక్రయించారు. ఏకొల్లులోని సంపద తయారీ కేంద్రాన్ని ఆదర్శంగా తీసుకుని మిగిలిన ప్రాంతాల్లోని కేంద్రాలను కూడా అన్ని విధాలుగా తీర్చిదిద్దారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటి నిర్వహణను గాలికొదిలేయడంతో ఎరువుల తయారీ అటకెక్కింది.

500 కేజీల వరకు విక్రయించాము



ఏకొల్లులోని సంపద తయారీ కేంద్రంలో గత ఏడాది వర్మీకంపోస్టు ఎరువు 500 కేజీల వరకు తయారు చేసి రైతులకు విక్రయించాము. అంతే కాక పంచాయతీల్లో వివిధ రకాల మొక్కలకు వర్మీకంపోస్టు ఎరువు వేశాము. దీంతో పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరింది.

– బి.రామయ్య, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి, ఏకొల్లు

అభివృద్ధి బాటలో నడిపేందుకు చర్యలు



డీవీ సత్రం మండలంలోని అన్ని సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి బాటలో నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించి తయారీ కేంద్రాల దుస్థితిపై చర్చించాం. త్వరలోనే అన్ని కేంద్రాల్లో వర్మీకంపోస్టు ఎరువు తయారయ్యేలా చూస్తాం.

– కె.గోవర్ధన్, ఎంపీడీవో, డీవీ సత్రం



వేణుంబాకంలో పిల్లర్ల కే పరిమితమైన కేంద్రం



సంపద తయారీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న తొట్లు

ఎట్టకేలకు సైదాపురం-పొదలకూరు రోడ్డుకు మోక్షం

సైదాపురం : మండల కేంద్రమైన సైదాపురం నుంచి పొదలకూరు రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. రూ.45 కోట్లతో పనులు చేపట్టడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో అడుగుతో గుంత ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు గుంతల్లో నీరు నిలవడంతో వాటిలో పడి గాయాలపాలవుతున్నారు. ఈ క్రమంలో గతంలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి రూ.45 కోట్లను మంజూరు చేయించారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు మొదలుపెట్టలేదు. ఇప్పుడు



జేసీబీలతోరోడ్డు పనులు చేస్తున్న సిబ్బంది

పనులు చేపట్టడంతో సైదాపురం మండల ప్రజలతోపాటు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ యాదవ్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రీవెన్స్‌లో భూ సమస్యలపై ఫిర్యాదులు

పెళ్లకూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా నల్లగులకండ్రిగ, పెన్నేపల్లి గ్రామాల ప్రజలు భూసమస్యపై ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ నల్లగులకండ్రిగలో ఉన్న ప్రభుత్వ భూములను స్థానికేతరులు ఆక్రమించుకున్నారని తెలిపారు. పెన్నేపల్లికి చెందిన రెండు కుటుంబాల వారు భూ సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి మాట్లాడుతూ పరిశీలించి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ యువరాజ్, వివిధ గ్రామాల వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

వెంకటగిరి రూరల్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని 9వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ అరుణ్‌బోస్ తెలిపారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌లో సోమవారం తిరుపతి రమాదేవి సూపర్‌స్పెషాలిటీ, డాక్టర్ అగర్వాల్ కంటి, ఫిరోజ్ డెంటల్ వైద్యశాలలు, తిరుపతి బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా మెగా మెడికల్ క్యాంప్, రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం రక్తదానం చేసిన అధికారులు, సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేశారు.



రక్తదానం చేస్తున్న బెటాలియన్ అధికారులు

అసిస్టెంట్ కమాండెంట్ కోటిరెడ్డి, రామకృష్ణ, యూనిట్ వైద్యులు శేషమ్మ, ప్రవీణ్‌రెడి పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం

తడ: సూళ్లూరుపేట సబ్ స్టేషన్ వద్ద 100ఎంవీఏ 220/132 కేవీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ ఫిల్టరేషన్ ప్రక్రియ చేస్తున్నందున వ్యవసాయ విద్యుత్ నిరంతరాయంగా ఇవ్వలేమని నాయుడుపేట ఈఈ వై.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నుంచి నవంబర్ 2వ తేదీ వరకు సబ్ స్టేషన్ పరిధిలో వ్యవసాయానికి షెడ్యూల్ ప్రకారం కాకుండా రాత్రి సమయాల్లోనూ విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ తనిఖీ

నాయుడుపేట టౌన్ : మండలంలోని మేనకూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సోమవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి వైద్యాధికారిణి హరిత ఆరా తీశారు. వెల్‌నెస్ సెంటర్ రికార్డులను పరిశీలించారు. విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలోని పాఠశాలల్లోని విద్యార్థులు, గ్రామాల్లో గర్భిణులతో మాట్లాడారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి వికాస్, గణాంకాల అధికారి నాగేంద్రకుమార్, డీపీహెచ్ఎన్‌వో ఇన్‌చార్జి నరేష్‌బాబు, డీపీవో ప్రకాష్ పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులతో ఊపిరితిత్తుల క్యాన్సర్

సూళ్లూరుపేట రూరల్ : పొగాలకు ఉత్పత్తులు వినియోగిస్తే గొంతు, ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తుందని పేర్నాడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.రమణయ్య తెలిపారు. సూళ్లూరుపేట మండలం కోటపోలూరు–2 సచివాలయం పరిధిలో గ్రామాల్లో సోమవారం తిరుపతి స్విమ్స్, బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. పలు రకాల క్యాన్సర్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యురాలు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

2న ఆలయ భూముల వేలం

దక్కిలి : మండలంలోని దగ్గవోలులో వెలసిన వేణుగోపాలస్వామి, నాగలింగేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించిన భూములకు నవంబర్ 2న గ్రామ చావిడి దగ్గర వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలిచిన వారు ముందుగా ధరావత్తు చెల్లించాలని సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో వద్ద సోమవారం ఆర్టీసీ బస్సును కారు ఢీకొంది. వేనాడుకు వెళ్లే ఆర్టీసీ బస్సు సోమవారం డిపో నుంచి బస్టాండ్‌కు బయలుదేరింది. జాతీయ రహదారిపై మలుపు తిరుగుతుండగా చెన్నై నుంచి నాయుడుపేటకు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో ఉషారాణి అనే మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్‌ఐ బ్రహ్మనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మైనింగ్ కేసులో వైవీ రామిరెడ్డి అరెస్టు

రాపూరు : మండలంలోని పులిగిలపాడు సమీపంలోని ప్రభుత్వ భూముల్లో అక్రమ మైనింగ్ చేస్తున్న ఎస్ఎల్‌వీ క్రషర్ యజమాని వైవీ రామిరెడ్డిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ వెంకట్‌రాజేష్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మైనింగ్ చేస్తున్నట్లు తహసీల్దార్ లక్ష్మీనరసింహం ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ క్రమంలో ఆయనను అరెస్టు చేసి వెంకటగిరి కోర్టులో హాజరుపరిచినట్టు వెల్లడించారు.

ప్రారంభం కాకమునుపే ఓవర్ హెడ్ ట్యాంక్ కూల్చివేత!

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర్‌లో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రారంభించకుండానే కూల్చి వేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. 2006లో అప్పటి ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో రూ.ఐదు కోట్లతో సమ్మర్ స్టోరేజీని నిర్మించారు. ఇందులో భాగంగా సాయినగర్ ప్రజలకు తాగు నీరు అందించేందుకు 60 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించారు. తర్వాత దాన్ని ప్రారంభించలేదు. దాన్ని పరిశీలించి పరిస్థితి ఏమిటనే విషయాన్ని ఆర్అండ్‌బీ ఆధికారులు సర్టిఫికెట్ ఇవ్వాల్సి వుంది. ఆ పని చేయకుండానే కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం ట్యాంక్‌ను కూలదోసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విషయాన్ని మంగళవారం నిర్వహించనున్న మున్సిపల్ సాధారణ సమావేశం ఎజెండాలో 20వ అంశం కింద చేర్చారు. ఇందుకు గాను రూ.2.80 లక్షలు కేటాయించారు. గతంలో మన్నారుపోలూరులోని న్యూకాలనీ ఒక ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ఒక్క రోజు కూడా వాడకుండానే కూలదోశారు. మున్సిపల్ కార్యాలయం వెనుక 90 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ ఇప్పటికీ నిరుపయోగంగానే వుంది. కళాక్షేత్రంలో మరో ట్యాంక్ ఉంది. సాయినగర్ ఓవర్ హెడ్ ట్యాంక్ కూల్చి వేసి ఆ స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం కూడా వుంది. అప్పట్లో ట్యాంక్‌ను 30 అంకణాల స్థలంలో నిర్మించారు. ప్రస్తుతం అక్కడ అంకణం రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షలు వరకు ధర పలుకుతోంది. దీనిపై కన్నేసిన కొందరు నాయకులు ట్యాంక్‌ను కూలదోసి కొద్ది రోజుల తర్వాత స్థలాన్ని ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. మున్సిపాలిటీ ఉన్నతాధికారులు దీనిపై విచారించి నిర్ణయం తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సాయినగర్‌లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ ఇదే

విద్యార్థుల సమస్యలపై పోరాటాలు

నాయుడుపేట టౌన్ : విద్యార్థుల సమస్యలపై పోరాటాలకు సిద్ధమైనట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి తెలిపారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం విద్యార్థులతో కలిసి ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ నవంబరు 6న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం ఎంపీడీవో సురేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు మనోజ్, ప్రవీణ్, శివ, కేశవ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వసతి

చిల్లకూరు : మండలంలోని ఆలనా పాలనా లేని 60 ఏళ్ల దాటిన వృద్ధులకు ఉచితంగా వసతి కల్పిస్తామని స్వయం కృషి రూరల్, అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యదర్శి శ్రీలత తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. చిల్లకూరు మండలంలోని పలు ప్రాంతాల్లో ఆలనా, పాలనా లేని వృద్ధులు ఎంతోమంది ఉన్నారని తెలిపారు. వారికి వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. వసతి పొందాలనే వృద్ధులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటరు కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకువస్తే వారి ఇష్టం మేరకు వసతి కల్పిస్తామని చెప్పారు.

వేలం పాటలను అడ్డుకున్న గ్రామస్తులు

నాయుడుపేట టౌన్ : మండలంలోని విన్నమాలలో ఉన్న శ్రీకాళహస్తీశ్వర, వేణుగోపాలస్వామి ఆలయాల భూములను సోమవారం దేవదాయ శాఖ అధికారులు చేపట్టిన వేలం పాటలను గ్రామ పెద కాపు ఆరవభూమి శ్రీనివాసులురెడ్డితో కలిసి గ్రామస్తులు అడ్డుకున్నారు. సుమారు 19 ఎకరాల భూములను ఏడాది లీజుకు ఇచ్చేందుకు వేలం పాటలు నిర్వహించేందుకు దేవదాయ శాఖ గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, ఈవో రవికృష్ణ గ్రామానికి చేరుకున్నారు. ఐదు నెలల క్రితం ఆలయం వద్ద నాయుడుపేటలోని శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయానికి చెందిన ఖాళీ స్థలానికి నెలకు రూ.లక్ష అద్దె చెల్లించేలా ఆరవ భూమి శ్రీనివాసులురెడ్డి వేలం పాటలో దక్కించుకున్నారు. ఇప్పటి వరకు ఆ స్థలాన్ని ఆయనకు అప్పగించలేదు. ఈ విషయంపై ఆయన గ్రామస్తులతో కలిసి అధికారులను నిలదీశారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ గతంలో కోర్టు స్టే ఇచ్చిందన్నారు. మంగళవారం కోర్టు వాయిదా ఉందని, స్టే తొలగించేలా చర్యలు తీసుకుని శ్రీనివాసులు రెడ్డికి స్థలాన్ని అప్పగిస్తామని చెప్పారు. స్థలాన్ని అప్పగించిన తర్వాతే భూములకు వేలం పాటలు నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేయడంతో అధికారులు వెనుదిరిగారు. దేవదాయ శాఖ సిబ్బంది హరిరెడ్డి, యుగంధర్, బాలాజీ, విన్నమాల వీఆర్వో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



వేలం పాటలను అడ్డుకుంటున్న పెదకాపు శ్రీనివాసులు రెడ్డి తదితరులు

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత

దొరవారిసత్రం : తుంగమడుగు సమీపంలోని కాళంగ నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సోమవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. కాళంగి నది నుంచి కొన్ని రోజులుగా రాత్రి, పగలు తేడాలేకుండా ట్రాక్టర్లలో ఇసుకను సూళ్లూరుపేట, తడ, వరదయ్యపాళెం మండలాల్లోని పలు గ్రామా ల మీదుగా ఆంధ్రా–తమిళనాడు సరహద్దు ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఈ క్రమంలో ఇసుక రవాణాను అడ్డుకోవాలని స్థానికులు పలుమార్లు పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు పట్టించుకోకపోవడంతో సోమవారం ట్రాక్టర్లను అడ్డుకున్నారు.



తుంగమడుగులో ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల నిరసన

గూడూరు రూరల్ : గూడూరు మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. వారు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కార్మికుడు మృతి చెందితే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. జీవో నంబర్ 36 ను అమలు చేసి ఉద్యోగ విరమణ బెనిఫిట్స్‌ను వెంటనే చెల్లించాలని కోరారు. సీపీఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సీఐటీయూ కార్యదర్శి సురేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు పుట్టా శంకరయ్య, కేవీపీఎస్ నాయకుడు అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ కార్మికుల ధర్నా

నాయుడుపేట టౌన్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులు సోమవారం కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సీఐటీయూ నేత ముకుంద మాట్లాడుతూ కార్మికులకు ప్రతినెలా క్రమంతప్పకుండా జీతాలు చెల్లించాలన్నారు. జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, ప్రభుత్వ సెలవు దినాలను పక్కాగా అమలుచేయాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి మేనేజర్ షేక్ అక్తర్‌కు వినతి పత్రం అందజేశారు.



నాయుడుపేట : నిరసన తెలుపుతున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

అదేవిధంగా మధ్యాహ్న భోజనం కార్మికులు ఎమ్మార్సీ వద్ద నిరసన తెలిపారు. ఆ సంఘ జిల్లా కార్యదర్శి కే విజయమ్మ ఎంఈఓ మునిరత్నంకు వినతి పత్రం అందజేశారు. రాజకీయ వేధింపులు అరికట్టాలని, విద్యార్థుల అందించే మెను చార్జీలు పెంచాలని కోరారు.

భోజనం కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

వెంకటగిరి(సైదాపురం) : మధ్యాహ్న భోజనం కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వడ్డిపల్లి చెంగయ్య కోరారు. ఆయన సోమవారం కార్మికులతో కలిసి వెంకటగిరి ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వమే గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

వెంకటగిరి(సైదాపురం) : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వెంకటగిరి సీఐ ఏవీ రమణ తెలిపారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం వెంకటగిరి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పోలీసు స్టేషన్ విధి విధానాలు, ఆయుధాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ సుబ్బారావు, ఏఎస్‌ఐ బీవీ రమణ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై విచారణ

కోట : మండలంలోని అల్లంపాడులో చేపట్టిన ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిపై ఏపీడీ వరప్రసాద్ సోమవారం విచారణ చేపట్టారు. 2023–24 లో పలుచోట్ల కూలీలు పనులు చేయకపోయినా మస్టర్లు వేసి నగదు స్వాహా చేసినట్టు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. విచారణలో తేలిన విషయాలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేసి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

బురదమయంగా రోడ్లు



నాంచారమ్మపేటలో రోడ్డు దుస్థితి



ఇళ్ల మధ్యలో రోడ్డుపైనే నిలిచిన మురుగు నీరు

చిల్లకూరు : మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్లు బురదమయంగా మారాయి. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు వార్డు సభ్యులకు కూడా తెలియకుండా తూతూ మంత్రంగా పనులు చేసి బిల్లులు స్వాహా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు నిదర్శనమే మండలంలోని ముత్యాలపాడు పంచాయతీ నాంచారమ్మపేట గ్రా మం దళితవాడలో వేసిన గ్రావెల్ రోడ్డు. ఈ రోడ్డు ను మండల పరిషత్, ఆర్థిక సంఘం నిధులతో గ్రావెల్ రోడ్డు వేసేలా తీర్మానం చేసి పనులు చేపట్టారు. గ్రావెల్ తోలి రోలింగ్ చేయకుండా వదిలేశారు. దీంతో వర్షం కురిసిన ప్రతిసారీ రోడ్డు బురదమయంగా మారి నడిచేందుకు కూడా వీలు లేకుండా పోతోంది. జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకు ని నాంచారమ్మపేటలోని రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.